సాక్షి
జనగామ
శనివారం । 11 । ఫిబ్రవరి । 2023



విద్యార్థులతో వంట పనులు

తమ్మడపల్లి(జి) ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల చేత వంట, పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నట్లు ఎస్‌ఎంసీ సభ్యులు చెప్పారు. - 8లో▸



పనులు పూర్తి చేయాలి

మహాశివరాత్రి సందర్భంగా సోమేశ్వరాలయంలో చేపట్టిన సుందరీకరణ పనులు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అన్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం $35^0/17^0$

ఉదయం తేమతోకూడిన చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయి. రాత్రి పూట చలి తీవ్రత అధికంగా ఉంటుంది.

‘కంది’ రంది తీరేనా..!

22,689 ఎకరాల్లో కంది పంట సాగు

- దెబ్బతీసిన మారుక, పచ్చపురుగు
- 40 శాతమే పంట చేతికి వచ్చే అవకాశం
- మద్దతు ధరకు మించి రేటు ఉన్నా నిష్ప్రయోజనం
- సీజన్ చివరి వరకు ఈ ధర ఉంటేనే రైతుకు ఉపశమనం



పక్క ఫొటోలోని రైతు పేరు బియ్య యాదయ్య. బచ్చన్నపేట మండలం బోనకొట్లూరుకు చెందిన ఆయన.. తనకున్న రెండు ఎకరాల చెల్కలో కంది పంట సాగు చేశాడు. పెట్టుబడులకు రూ.18వేల వరకు ఖర్చు చేశాడు. చీడపీడలు, కోతులతో చాలా వరకు పంట దెబ్బతింది. మిగిలిన పంటను కాపాడుకునేందుకు రాత్రింబవళ్లు కాపలా కాయగా.. రెండున్నర క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మూడు రోజుల క్రితం మార్కెట్‌కు అమ్ముకునేందుకు తీసుకువెళ్లగా రూ.7,500 ధర వచ్చింది. ‘దిగుబడి తగ్గినా.. ధర కాస్త పెరగడంతో కొంత నష్టం తీరింది’ అంటూ యాదయ్య పేర్కొన్నాడు.



చీడ పీడలు ఆశించిన కంది పంట

జనగామ: కంది పంటపై రైతులు ఎన్నో ఆశలు పెట్టుకోగా.. వాతావరణ ప్రతికూల పరిస్థితులు, చీడపీడల ప్రభావం దిగుబడిపై తీవ్రంగా పడింది. జిల్లాలో లక్ష క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తుందని ఆశించగా.. 60శాతం తగ్గిపోయే పరిస్థితి నెలకొంది. అయితే మార్కెట్‌లో ప్రస్తుతం కందులకు ఎమ్మెస్పీకి మించి ధర లభిస్తున్నా రైతులకు పెద్దగా ప్రయోజనం చేకూరే అవకాశం కనిపించడం లేదు.

22,689 ఎకరాల్లో సాగు..

వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేయాలని వ్యవసాయశాఖ ప్రచారం చేపట్టింది. అధికారుల సూచనలు.. మరోవైపు కాలం కలిసి రావడంతో జిల్లాలో సుమారు 16,500 మంది రైతులు వానాకాలం సీజన్‌లో 22,689 ఎకరాల్లో సాగు చేశారు. గత ఏడాది అక్టోబర్ వరకు మొక్క ఎదుగుదల.. పూత దశలో మారుక.. కాయ దశలో పచ్చ పురుగు ఆశించడంతో నివారణకు రైతులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. పెట్టుబడి విపరీతంగా పెరిగిపోయింది. ఎకరాకు సరాసరి 5 క్వింటాళ్ల చొప్పున 1.13లక్షల క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా.. రెండు రకాల చీడపీడలు పంటను నాశనం చేయడంతో 50వేల క్వింటాళ్లు వచ్చే అవకాశముందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు.

మార్కెట్‌లో డిమాండ్..

కంది పంటకు ప్రభుత్వం క్వింటాకు రూ.6,600 మద్దతు ధర ప్రకటించింది. అయితే దిగుబడి తగ్గిపోవడంతో మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. జనగామ వ్యవసాయ మార్కెట్ లో కొద్ది రోజులుగా క్వింటా కందులకు గరిష్ఠంగా రూ.6,982, మధ్యస్థం రూ.6,865, మోడల్ రూ.6,925 వరకు పలుకుతోంది. రోజువారీగా 30 నుంచి 40 బస్తాల కందులు వస్తున్నాయి. కమీషన్ కటింగ్ విషయంలో రైతులు నష్టపోకుండా మార్కెట్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

విక్రయానికి వచ్చే పంట పెరిగే సమయంలోనూ ధర ఇలా ఉంటేనే దిగుబడి తగ్గినా అన్నదాతకు కొంత ఉపశమనం కలిగే అవకాశం ఉంది. మార్కెట్‌కు కందుల రాక పెరిగినప్పుడు ధర తగ్గితే మాత్రం రైతుకు ఏమీ మిగలదు.

అదనపు కమీషన్‌తో నష్టం..

అయితే.. సూర్యాపేట జిల్లా తిర్మలగిరి, తదితర వ్యవసాయ మార్కెట్ల పరిధిలో ధర ఎక్కువ వస్తుందనే ఆశతో జిల్లాలోని పలు ప్రాంతాల రైతులు కందులను ఆయా మార్కెట్లకు తీసుకెళ్తున్నారు. అక్కడ అధికారికంగా రూ.2 కమీషన్ తీసుకోవాల్సి ఉన్నప్పటికీ రూ.1 అదనంగా తీసుకుంటున్నట్లు రైతులు చెబుతున్నారు. అంతేకాకుండా రవాణా ఖర్చులు భారంగా మారుతుండంతో.. జనగామ మార్కెట్‌లోనే పంట అమ్ముకుంటున్నారని సమాచారం. జనవరి నుంచి ఇప్పటి వరకు స్థానిక మార్కెట్‌లో 422 మంది రైతుల నుంచి 1,339 క్వింటాళ్ల కందులను కొనుగోలు చేశారు. 10వేల నుంచి 15వేల క్వింటాళ్లు కొనుగోలు లక్ష్యంగా ప్రణాళిక సిద్ధం చేసుకున్న అధికారులు రైతులు పక్క మార్కెట్లకు వెళ్లకుండా అవగాహన కల్పిస్తున్నారు.

మంచి ధర కల్పిస్తున్నాం..



మార్కెట్‌లో కందులకు మంచి ధర కల్పిస్తున్నాం. ఎమ్మెస్పీ కంటే ధర అదనంగా పలుకుతోంది. రోజు వారీగా వచ్చే పంటలో అత్యధికంగా అదనపు ధర పలికేవే. కమీషన్ రూ.2శాతం కంటే ఎక్కువ తీసుకోకుండా పర్యవేక్షిస్తున్నాం. అధిక ధర వస్తుందని ఆశతో ఇతర మార్కెట్‌లకు కందులు తీసుకువెళ్లి నష్టపోవద్దు. ప్రతి గింజా కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

– జీవన్‌కుమార్, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి, జనగామ ఏఎంసీ

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య



మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన ఉషాదయాకర్‌రావు

దేవరుప్పుల: సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శివలింగయ్య అన్నారు. స్థానిక హైస్కూల్‌లో ‘కంటి వెలుగు’ శిబిరం, ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ ఉషాదయాకర్‌రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తోందని చెప్పారు. మహిళలు స్వయం సమృద్ధి సాధించేందుకు ఉచిత కుట్టు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రమాదేవినర్సింహారెడ్డి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీఓ సురేష్‌కుమార్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దయాకర్, ఎంపీడీఓ సురేష్‌కుమార్, వైద్యుడు అనిల్‌కుమార్, గ్రంథాలయ సంస్థ, పీఏసీఎస్ డైరెక్టర్లు భిక్షపతి, జలంధర్‌రెడ్డి, ఉపసర్పంచ్ పాల్గొన్నారు.





అవినీతి పాలనను తరిమికొట్టాలి

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమేందర్‌రెడ్డి

బచ్చన్నపేట/జనగామ రూరల్: రాష్ట్రంలో అవినీతి పాలన నడుస్తున్నది.. దానిని తరిమికొట్టడానికి వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌కు తగిన గుణపాఠం చెప్పాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బచ్చన్నపేట మండలం పోచన్నపేటలో పార్టీ జెండా ఆవిష్కరించిన అనంతరం సద్ది సోమిరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన స్ట్రీట్ కార్నర్ సమావేశంలో మాట్లాడారు. కేంద్ర నిధులతో రాష్ట్రంలో అభివృద్ధి పనులు చేపడుతూ.. సీఎం గొప్పలు చెప్పుకుంటున్నారని, అన్ని వర్గాలను ఆదుకుంటున్నామని చెబుతున్నా.. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. భూకబ్జాలకు పాల్పడుతూ కోట్ల ధనాన్ని కొల్లగొడుతూ ఎమ్మెల్యేలు, ఎంపీలు జేబులు నింపుకుంటున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించడమే ప్రధాన లక్ష్యమని, అందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప, ఉడుగుల రమేష్, కేవీఎల్ఎన్.రెడ్డి, బళ్ల శ్రీనివాస్, అఫ్జల్, జూకంటి గణేష్, బంగారు మహేష్, గద్ద రాజు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. జనగామలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రేమేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ సర్కారు నిరుద్యోగులకు భృతి ఇస్తామని చెప్పి నేటికీ అమలు చేయలేదని, పెట్టుబడి సాయమని చెప్పి రైతులకు సబ్సిడీలు ఎత్తివేసిందని ధ్వజమెత్తారు. ప్రజా సమస్యలపై పార్టీ చేపట్టిన ‘ప్రజాగోస-బీజేపీ భరోసా’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కోరారు.











సుందరీకరణ పనులు పూర్తి చేయాలి

● అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పరిసర ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి, సుందరీకరణ పనులు వెంటనే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. ఆలయంలో చండికా అమ్మవారి ప్రతిష్ఠ, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల పనులను ఆయన శుక్రవారం అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. భక్తుల సౌకర్యార్థం చేపట్టిన శానిటేషన్, క్యూలైన్లు, వీధిలైట్లు, మరుగుదొడ్లు, అంతర్గత రోడ్లు, తాగునీరు, గార్డెనింగ్ ప్లాంటేషన్ పనులు త్వరగా పూర్తి చేయాలని


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

చెప్పారు. జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది డ్యూటీలు షిఫ్టులవారీగా విభజించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ రామిరెడ్డి, డీపీఓ వసంత, ఆర్డీఓ కృష్ణవేణి, ఆలయ చైర్మన్ రామచంద్రయ్యశర్మ, కాంట్రాక్టర్ నరసింహారెడ్డి, ఈఓ రజనీకుమారి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రావు, ఎంపీపీ నాగిరెడ్డి, సర్పంచ్ యాకంతారావు తదితరులు పాల్గొన్నారు.

మహా అన్నదానం ఏర్పాట్ల పరిశీలన

ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించే వేడుకలకు హాజరయ్యే భక్తులకు మహాఅన్నదానం ఏర్పాట్లను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్‌కుమార్, ఎంపీపీ నాగిరెడ్డి, జెడ్పీ ఫ్లోర్ లీడర్ పుస్కూరి శ్రీనివాస్‌రావు పరిశీలించారు. ఒకేసారి రెండు నుంచి ఐదువేల మంది కూర్చుని భోజనం చేసేలా మంత్రి క్యాంపు కార్యాలయం పక్కన భూమిని చదును చేయిస్తున్నట్లు పేర్కొన్నారు.



ఏకకాలంలో రుణమాఫీ చేయాలి

● రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య


రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేస్తున్న రైతులు, నాయకులు

జఫర్‌గఢ్: రైతులకు సంబంధించిన పంట రుణాలను ఏకకాలంలో మాఫీ చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక అంబేడ్కర్ సెంటర్ వద్ద నిర్వహించిన రాస్తారోకోలో ఆయన మాట్లాడుతూ.. 2023–24 రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.26,831 కోట్లు కేటాయించినట్లు ఆర్థిక శాఖ మంత్రి ప్రకటించినప్పటికీ ప్రభుత్వ వ్యయ వాల్యూమ్ 2లో వ్యవసాయానికి రూ.20,890 కోట్లే ఉందన్నారు. రైతుల రుణమాఫీకి రూ.6,385 కోట్లే కేటాయించారని, ఈ నిధులతో 2018 ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా రూ.లక్షలోపు రుణాలను ఏలా మాఫీ చేస్తామని ప్రశ్నించారు. ఇప్పటికీ అనేక జిల్లాల్లో రైతులు డిఫాల్టర్లుగా మారారని, ప్రభుత్వం ఏకకాలంలో రుణమాఫీ చేసేందుకు నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఆయిల్‌పామ్ తోటల పెంపునకు అధిక ప్రాధాన్యత ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా అందుకు అనుగుణంగా నిధులు కేటాయించలేదని అన్నారు. రైతుబీమా వయో పరిమితిని 59 ఏళ్ల నుంచి 70 ఏళ్లకు పెంచాలని, వీటితోపాటు అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నక్క యాకయ్య, ఎండీ.శంషొద్దీన్, దొంతూరి రాజు, రవి, ఆకుల సారంగం, వేల్పుల చిన్నరాములు, తాటికాయల కుమార్, ఆకుల బలరాములు పాల్గొన్నారు.



మెరుగైన వైద్యసేవలందించాలి

బచ్చన్నపేట: స్థానిక సీహెచ్‌సీలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జనగామ ఎంసీహెచ్ సూపరింటెండెంట్ సుగుణాకర్‌రాజు అన్నారు. శుక్రవారం ఆయన ఆస్పత్రిని సందర్శించి ఓపీని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ 30 పడకల నుంచి సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ అయిన తరువాత ఆస్పత్రికి పలు వైద్య పరికరాలతోపాటు వాటి నిర్వహణకు ఆపరేటర్లను, అలాగే పలువురు వైద్యులను పంపించినట్లు పేర్కొన్నారు. వైద్యులు 24 గంటల పాటు అందుబాటులో ఉంటారని, అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సిద్ధార్థరెడ్డి వైద్యులు పాల్గొన్నారు.


రోగులతో మాట్లాడుతున్న సుగుణాకర్‌రాజు

విద్యార్థులతో వంట, పారిశుద్ధ్య పనులు

● ఎస్ఎంసీ సభ్యుల మండిపాటు

జఫర్‌గఢ్: మండల పరిధి తమ్మడపల్లి(జి) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో వంట, పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నారని ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ గుండెబోయిన రాజు, కమిటీ సభ్యులు ఎండీ.యాకుబ్‌పాషా, వడ్లకొండ సుధాకర్, గుండెబోయిన సతీష్, కొంతం కృష్ణమూర్తి, పులిగిల్ల నాగరాజు, ఉప సర్పంచ్ ఎండీ.శర్పొద్దీన్ తెలిపారు. ఎస్ఎంసీ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన అనంతరం వారు విలేకరులకు వివరాలు వెల్లడించారు. పాఠశాలలో వంట చేసే కార్మికులు ఉన్నా.. మధ్యాహ్న భోజనం, రాగిజావ వడ్డింపు పనులతోపాటు మరుగుదొడ్లు, మూత్రశాలలను విద్యార్థులతో శుభ్రం చేయిస్తున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా ఉపాధ్యాయులు పిల్లలపట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. 5వ తరగతి పిల్లలతో మిగతా వారికి పాఠాలు చెప్పిస్తున్నారని తెలిపారు. పాఠశాలలో ఏడుగురు ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ నిత్యం ఇద్దరు ముగ్గురు సెలవుల పేరుతో విధులకు డుమ్మా కొడుతున్నారని, దీంతో తమ పిల్లలు చదువులో పూర్తిగా వెనుకబడి పోయారని, కనీసం


తోటి పిల్లలకు రాగిజావ వడ్డిస్తున్న విద్యార్థులు

పదాలు, ఎక్కాలు కూడా రావడం లేదని వాపోయారు. పద్ధతి మార్చుకోవాలని పలుమార్లు సదరు ఉపాధ్యాయులకు చెప్పినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి విధులను నిర్లక్ష్యం చేస్తున్న ఉపాధ్యాయులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.


ఇన్‌చార్జ్ హెచ్ఎం గీతకు ఫిర్యాదు చేస్తున్న ఎస్ఎంసీ కమిటీ సభ్యులు

పిల్లలతో ఏ పనులూ చేయించడంలేదు..

తాము పిల్లలతో మధ్యాహ్నం భోజనం, రాగిజావా వడ్డింపు, మరుగుదొడ్లు శుభ్రం చేసే పనులు చేయించడం లేదు. ఉపాధ్యాయులంతా సక్రమంగానే విధులకు వస్తున్నారు. ఒకరికి మాత్రం యాక్సిడెంట్ కావడంతో లీవ్‌లో ఉన్నారు. ఎస్ఎంసీ కమిటీ సభ్యులు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదు. ఈ విషయాన్ని స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం దృష్టికి తీసుకెళ్లాను.

– గీత, ఇన్‌చార్జ్ హెచ్ఎం

నేటి నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ పరీక్షలు

జనగామ రూరల్: జిల్లాలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు డీఈఓ రాము షెడ్యూల్ విడుదల చేశారు. డ్రాయింగ్, పేయింటింగ్, లోయర్, హయ్యర్ గ్రెడ్ పరీక్షలు నాలుగు రోజుల పాటు.. ఉదయం, మధ్యాహ్నం రెండు పేపర్లు ఉంటాయని పేర్కొన్నారు. లోయర్ గ్రెడ్ డ్రాయింగ్ పరీక్షలకు 67 మంది, హయ్యర్ గ్రెడ్ 33 మంది, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్ పరీక్షకు 20, హయ్యర్ గ్రెడ్‌కు ఆరుగురు హాజరు కానున్నారని తెలి పారు. www.bsctctelangana.gov.in వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

జనగామ రూరల్: బాల్య వివాహాలను అరికట్టాలని బాలల సంక్షేమ కమిటీ జిల్లా చైర్మన్ ఉప్పలయ్య అన్నారు. శుక్రవారం జనగామ మండలం వడ్లకొండలో చైల్డ్‌లైన్ 1098 బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లలు, మహిళలకు సురక్షిత వాతావరణం కల్పించడానికి చైల్డ్‌లైన్ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. మానవ అక్రమ రవాణా, లైగింక వేధింపులు, బాల్య వివాహాలు, సైబర్ నెరాలపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. పిల్లలకు సంబంధించి సమస్యలపై చైల్డ్‌లైన్ టోల్ ఫ్రీ నంబర్ 1098, మహిళలకు 181, సైబర్ నెరాలకు సంబంధించి 1931కి కాల్ చేసి సమాచారం ఇస్తే సత్వర సేవలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సత్యనారాయణ, చైల్డ్‌లైన్ కౌన్సిలర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 56 శాతం రిజర్వేషన్ కల్పించాలి

జనగామ రూరల్: చట్ట సభల్లో బీసీలకు 56 శాతం రిజర్వేషన్ కల్పించడానికి పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైలారం సాయికార్తీక్ అన్నారు. ఈ డిమాండ్‌తో శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో అన్ని కులాలు, సామాజిక వర్గాలకు జనాభా ప్రాతిపదికన రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ప్రపంచంలో అణిచివేత, వివక్షకు గురైన అన్ని వర్గాలకు వాటా ఇచ్చి అభివృద్ధి చేశారని, ఒక్క మనదేశంలోనే ఎక్కువ జనాభా కలిగిన వారు కూడా అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా బీసీలు ఐక్యంగా ఏర్పాడి హక్కులు సాధించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మైలారం క్రాంతికుమార్, బి.కార్తీక్, జి.మధు, పులి శ్రవణ్ పాల్గొన్నారు.


ధర్నా నిర్వహిస్తున్న బీసీ విద్యార్థి నాయకులు







పేదల కష్టాలు తీరుస్తా..

● వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల
● జిల్లాలో కొనసాగిన పాదయాత్ర

రఘునాథపల్లి/నర్మెట: తెలంగాణలో అరాచక పాలన కొనసాగుతోంది.. ఆదరిస్తే పేదల కష్టాలు తీరుస్తానని వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ఆమె చేపట్టిన ప్రజాప్రస్థానం పాదయాత్ర శుక్రవారం రఘునాథపల్లి, నర్మెట మండలాల్లో సాగింది. రఘునాథపల్లి, దాసన్నగూడెం, ఖిలాషాపూర్, ఎర్రగడ్డతండా, మేకలగట్టు, గిద్దబండతండా, మచ్చుపహాడ్ గ్రామాల్లో ఆమె ప్రజలను పలకరిస్తూ సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ.. రైతులకు రుణమాఫీ, 24 గంటల కరెంటు, మహిళలకు సున్నా వడ్డీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, కేజీ టూ పీజీ విద్య, డబుల్ బెడ్రూం ఇళ్లు, దళిత బంధు.. ఇవన్నీ వదిలిపెట్టి దేశాన్ని ఉద్ధరిస్తానంటూ పిట్టకథలు చెబుతున్న సీఎం కేసీఆర్‌ను ఏమనాలి అని ప్రశ్నించారు. తనను ఆశీర్వదిస్తే అర్హులందరికీ పింఛన్లు, నిరుద్యోగ భృతి, పేదలకు ఇళ్లు, దళితులకు భూములు అందిస్తానని షర్మిల చెప్పారు. అనంతరం ఆగాపేటలో రాత్రి బస చేశారు. అంతకు ముందు రఘునాథపల్లిలో పార్టీ జెండా ఆవిష్కరించడంతో పాటు పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన షర్మిల.. వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో తన భర్త అనిల్‌కుమార్ బర్త్‌డే కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గొరబోయిన సమ్మయ్య, నియోజకవర్గ కోఆర్డినేటర్ సంగాల ఇర్మియ, మండల అధ్యక్షుడు ముసిపట్ల నరేష్‌బాబు, బక్క జంపన్న, బొల్లపల్లి సత్తయ్య, ఊరడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


రఘునాథపల్లి : పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తూ..


మచ్చుపహాడ్‌లో మహిళతో మాట్లాడుతున్న షర్మిల



ఆస్తి కోసమే తల్లి హత్య

● భార్య ప్రోద్బలంతో ఘాతుకం ● వివరాలు వెల్లడించిన డీసీపీ

జనగామ రూరల్: ఆస్తి కోసం భార్య ప్రోద్బలంతో తల్లిని హత్య చేశాడు. జనగామ మండలం మరిగడిలో గురువారం జరిగిన హత్య వివరాల్ని శుక్రవారం డీసీపీ సీతారాం వెల్లడించారు. తన కార్యాలయంలో నిందితులను మీడియా ఎదుట హాజరుపర్చారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కూరాకుల రాజయ్య, రమణమ్మ దంపతులకు ఇద్దరు సంతానం. పెద్ద కుమారుడు కన్నప్ప, కుమార్తె లావణ్య. ఏడాదిన్నర క్రితం కొత్తగూడేనికి చెందిన సాయికుమార్‌తో కుమార్తె వివాహం జరిగింది. కూతురు, అల్లుడి మధ్య గొడవ కారణంగా లావణ్య తల్లి వద్దే ఉంటోంది. ఈక్రమంలో తన బిడ్డకు ఏదైనా ఆధారం చూపాలని రమణమ్మ ఖిలాషాపూర్ గ్రామ శివారులో ఉన్న నాలుగెకరాల భూమిని లావణ్య పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించింది. ఈవిషయం తెలుసుకున్న కన్నప్ప తల్లితో గొడవ పడ్డాడు. ఈనెల 5న తల్లి తలను గోడకు బాదడంతో గాయమైంది. ఇదే విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కన్నప్పపై కేసు నమోదయ్యింది. దీంతో కన్నప్ప ఉరి వేసుకుంటానని బెదిరించి ఆత్మహత్యకు యత్నించాడు. ఆపై ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యాడు. అత్తవారి ఇంటి వద్దే ఉంటున్నాడు. కాగా.. గురువారం ఇంటికి వచ్చి రిజిస్ట్రేషన్ అయిన భూమిని తన పేరు మీద రాయాలని తల్లిని అడిగాడు. ఆమె నిరాకరించడంతో పథకం ప్రకారం వెంట తెచ్చుకున్న కత్తితో హత్య చేశాడు. తల్లిని చంపితేనే ఆస్తి దక్కుతుందని కన్నప్పను భార్య కళ్యాణి ప్రోత్సహించినట్లు అందుకే అతడు ఈదారుణానికి ఒడిగట్టాడని డీసీపీ సీతారాం తెలిపారు. అరెస్ట్ చేసిన వారిని కోర్టులో హాజరు పర్చనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈసమావేశంలో ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్సైలు రఘుపతి, జీనత్ పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సీతారాం, పక్కన ఏసీపీ దేవేందర్‌రెడ్డి సీఐ శ్రీనివాస్